క్లుప్తంగా

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



వధువు కుటుంబ సభ్యులకు పెళ్లి కానుక అందజేస్తున్న ఎంపీపీ తదితరులు

చంద్రగిరి: మండలంలోని మల్లయ్యపల్లికి చెందిన శిరీష, ప్రణయ్‌కు పెళ్లి నిశ్చయమైంది. వారికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపిన పెళ్లి కానుకను బుధవారం ఎంపీపీ హేమేంద్ర కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు పనల నాగరాజు అందజేశారు. వారు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మురళి రెడ్డి, నాయకులు మదన్ మోహన్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

టీటీడీ ఉద్యోగుల క్రీడాపోటీలకు ఏర్పాట్లు పూర్తి

తిరుపతి అలిపిరి: టీటీడీ ఉద్యోగుల వార్షిక క్రీడా పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో గల పరేడ్ మైదానంలో గురువారం ఉదయం 10.30 గంటలకు క్రీడలను ప్రారంభించనున్నారు. ఈ పోటీలు ఈనెల 19వ తేదీ వరకు జరుగనున్నాయి. పోటీలను పురుషులు, మహిళలకు వేర్వేరుగా నిర్వహిస్తారు. ఇందులో టగ్ ఆఫ్ వార్, చెస్, వాలీబాల్, క్యారమ్స్, బాల్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్, క్రికెట్, షటిల్, టెన్నిస్ తదితర క్రీడలు ఉన్నాయి. పరేడ్ మైదానంతో పాటు రిక్రియేషన్ హాల్, ఎస్వీ హైస్కూల్ మైదానం, ఎస్వీ జూనియర్ కళాశాల మైదానం, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల మైదానం, శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్సులో పోటీలు నిర్వహిస్తారు. ఏర్పాట్లను టీటీడీ సంక్షేమ విభాగం డిప్యూటీ ఈవో స్నేహలత పర్యవేక్షిస్తారు.

సాయితేజకు వెండి పతకం



దరహాస్ సాయితేజను అభినందిస్తున్న హెచ్‌ఎం సురేష్, పీడీ సుబ్రమణ్యం

రామచంద్రాపురం: మండలంలోని నెత్తకుప్పం ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి దరహాస్ సాయితేజ జిల్లా స్థాయి త్రోబాల్ పోటీల్లో వెండి పతకం సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు సురేష్, పీడీ సుబ్రమణ్యం తెలిపారు. విద్యార్థిని బుధవారం అభినందించారు. వారు మాట్లాడుతూ జనవరి 28 నుంచి 30 వరకు కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగిన 66వ పాఠశాలల క్రీడల సమాఖ్య త్రోబాల్ పోటీల్లో దరహాస్ ద్వితీయ స్థానంలో నిలిచాడని పేర్కొన్నారు.

సైనికుల శ్రేయస్సు ప్రజల బాధ్యత



జిల్లా సైనిక వెల్ఫేర్ ఆఫీసర్‌కు విరాళం అందజేస్తున్న రిజిస్ట్రార్ రజని

తిరుచానూరు: సరిహద్దులో ప్రాణాలను ఒడ్డి పోరాడుతున్న సైనికుల సంక్షేమానికి కృషి చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పద్మావతి మహిళా వర్సిటీ రిజిస్ట్రార్ రజని తెలిపారు. స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ శారద ఆధ్వర్యంలో సాయుధ దళాల సిబ్బంది సంక్షేమం కోసం రూ.50,316 విరాళం సేకరించారు. మొత్తాన్ని బుధవారం రిజిస్ట్రార్ రజనితో కలిసి జిల్లా సైనిక వెల్ఫేర్ ఆఫీసర్ విజయ శంకర్‌రెడ్డికి అందజేశారు.

ముక్కంటి సేవలో ఎస్పీ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికి దర్శనం కల్పించారు. అనంతరం గురుదక్షిణా మూర్తి సన్నిధిలో పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. సీఐ అంజుయాదవ్ పాల్గొన్నారు.

పచ్చదనం పెంపే లక్ష్యం

- చంద్రగిరి కోనసీమను తలపించాలి
- రూ.2.50 కోట్లతో 2.50 లక్షల మొక్కల పంపిణీ
- ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

తిరుపతి రూరల్: పచ్చదనం పెంపే లక్ష్యంగా మొక్కల పెంపకాన్ని ఒక యజ్ఞంలా చేపట్టినట్టు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం తిరుపతి రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో చంద్రగిరి నియోజకవర్గంలోని ఎంపీడీవోలు, ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ చంద్రగిరిని కోనసీమ తరహాలో పచ్చని ప్రాంతంగా తీర్చిదిద్దుదామన్నారు. మొక్కలు నాటి వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఒక చెట్టును మూడేళ్లు కాపాడితే అది మనిషి ప్రాణాలను వందేళ్ల వరకు తీసుకు వెళుతుందన్నారు. గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా పూలు, పండ్లు అందించే మొక్కలు నాటడం వలన ఆక్సిజన్‌తో పాటు తినడానికి మధురమైన పండ్లు అందిస్తాయన్నారు. కరోనా సమయంలో ఆక్సిజన్ అందక ఎంతో మంది ప్రాణాలు విడిచారని వాపోయారు. ఆక్సిజన్ కోసం ఆస్పత్రుల చుట్టూ పరుగులు తీయాల్సి వచ్చిందన్నారు. పచ్చని చెట్లు పెరిగిన ప్రాంతాల్లో ప్రజలకు కరోనా వచ్చినా ఆక్సిజన్ సమస్య రాలేదని, తద్వారా ప్రాణం నష్టం పెద్దగా జరగలేదన్నారు. తుమ్మలగుంటలో 3,460 ఇళ్లకు పది వేల మొక్కలు పెంచినట్టు తెలిపారు. కరోనా వచ్చినా మరణాల సంఖ్య చాలా తక్కువగా నమోదైనట్టు వివరించారు. చెట్ల పెంపకంలో తుమ్మలగుంటను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు.

2.50 లక్షల మొక్కల పంపిణీ

తుడా ఆధ్వర్యంలో రూ.2.50 కోట్లు ఖర్చు చేసి 2.50 లక్షల మొక్కలు పంపిణీకి సిద్ధం చేసినట్టు ఎమ్మెల్యే చెవిరెడ్డి వెల్లడించారు. సంవత్సరం పొడవునా పూలు, పండ్లు ఇచ్చే 24 రకాల చెట్లను ఎంపిక చేశామన్నారు. మొక్కల పెంపకంపై అశ్రద్ధ చూపిస్తూ బాధ్యతలను విస్మరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎవరికి ఎన్ని, ఏ రకం మొక్కలు కావాలో జాబితా ఇవ్వాలని సూచించారు. డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, తుడా కార్యదర్శి లక్ష్మి, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచేలా పాతకాల్వ అభివృద్ధి



పాతకాల్వ పంచాయతీలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

- రూ.4.73 కోట్ల అభివృద్ధి పనులు
- ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

తిరుపతి రూరల్: చరిత్రలో నిలిచేలా పాతకాల్వ పంచాయతీని అభివృద్ధి చేస్తున్నట్లు తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం పాతకాల్వ పంచాయతీలో గడప గడపకూ మహా పాదయాత్ర చేపట్టారు. సర్పంచ్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఆయన గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వకుళమాత ఆలయంలో సేవ చేసే అవకాశం కల్పించాలని మహిళలు కోరారు. పింఛను రద్దయిందని తెలిపారు. ఇళ్లు, ఉద్యోగం ఉన్న కారణంగా పింఛన్ రద్దయిందని అధికారులు తెలిపారు. వకుళమాత ఆలయంలో సేవ చేసేందుకు టీటీడీ ఉన్నతాధికారులతో మాట్లాడతానన్నారు. ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు చాక్లెట్లు పంచిపెట్టారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ చేయలేని విధంగా 1వ తేదీనే పింఛన్లు అందజేస్తున్నట్టు తెలిపారు. పంచాయతీలో రూ.4.73 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. ప్రజల సమక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు చెంచుమోహన్ యాదవ్, ప్రకాష్, వరాల రెడ్డి, నాగభూషణంరెడ్డి, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి



మంగళం సర్కిల్‌లో ఏర్పాటు చేసిన స్పీడు బ్రేకర్

తిరుపతి మంగళం: రోడ్డు ప్రమాదాల నివారణపై రవాణా, ఆర్ అండ్ బీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇటీవల వారం రోజులు జిల్లా రవాణాశాఖాధికారి సీతారామిరెడ్డి నేతృత్వంలో రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించి వాహన డ్రైవర్లు, కళాశాలల విద్యార్థులకు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తిరుపతి–కరకంబాడి రోడ్డులోని ఇంజినీరింగ్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు బైక్‌లపై ముగ్గురిని ఎక్కించుకుని వేగంగా వెళుతూ ప్రమాదాల బారిన పడిన సంఘటనలు ఉన్నాయి. విద్యార్థులు, ఆటో డ్రైవర్ల వేగాన్ని తగ్గించి ప్రమాదాలను నివారించేందుకు మంగళం సర్కిల్ నుంచి కళాశాలల వరకు ఉన్న ప్రధాన మలుపులు వద్ద స్పీడు బ్రేకర్లను ఏర్పాటు చేశారు. స్పీడ్ గన్లు ఏర్పాటు చేసి అతి వేగంగా వెళ్లే వారికి జరిమానా విధిస్తున్నారు. రవాణాశాఖ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని జిల్లా రవాణాశాఖాధికారి సీతారామిరెడ్డి కోరారు.

అటవీ స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు



అధికారులతో వాగ్వాదం చేస్తున్న హరిజనవాడలోని ఒక వర్గానికి చెందిన గ్రామస్తులు

తిరుపతి మంగళం: అటవీ స్థలాన్ని ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు బుధవారం హెచ్చరించారు. తిరుపతి 50వ డివిజన్ తిమ్మినాయుడుపాళెం హరిజనవాడ వాసులు అనేక ఏళ్లగా వినియోగించుకుంటున్న శ్మశాన స్థలంలో కొందరు ఇళ్లు నిర్మించుకున్నారు. వారు శ్మశానం కోసం అటవీ భూమిని శ్మశానానికి కావాలని ఆందోళనలకు దిగడంపై మరొక వర్గానికి చెందిన స్థానికులు పెదవి విరిచారు. తాతల కాలం నుంచి శ్మశానం కోసం గ్రామ చివర ఉన్న రెండు ఎకరాల భూమిని వినియోగిస్తున్నామని చెబుతున్నారు. ఆ స్థలాన్ని ఆక్రమించుకుని ఇళ్లు కట్టుకున్నప్పుడు శ్మశానమని గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. ఇదిలా ఉండగా మరో వర్గం వారు మాట్లాడుతూ గ్రామ సమీపంలోని అటవీ స్థలంలో కర్మక్రియలు చేసుకుంటున్నామని, దాన్ని శ్మశానానికి కేటాయించాలని పట్టుబట్టారు. ఇందుకోసం రెవెన్యూ అధికారులకు వినతి పత్రాలు అందజేసినట్టు పేర్కొన్నారు. అందుకు అటవీశాఖ అధికారులు అంగీకరించలేదు. స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. దీంతో అటవీశాఖ అధికారులు, గ్రామస్తులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అటవీశాఖ స్థలం ఇవ్వాలంటే అందుకు బదులుగా రెండింతలు ఇచ్చేలా రెవెన్యూ అధికారులు అంగీకరిస్తేనే తాము స్థలం కేటాయిస్తామని అటవీశాఖ అధికారులు తెలిపారు. 45 రోజులు గడువు ఇవ్వాలని, అప్పటిలోగా రెవెన్యూ అధికారుల నుంచి అనుమతులు తీసుకొస్తామని కొందరు గ్రామస్తులు చెప్పారు. దీంతో అటవీ, పోలీసు అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన వెంకటేష్

చంద్రగిరి: మండలంలోని నారావారిపల్లి సమీపంలో బుధవారం ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. పులిచర్ల మండలం కొత్తపేటకు చెందిన వెంకటేష్ బైక్‌లో తిరుపతి నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. నారావారిపల్లి సమీపంలోని టీటీడీ కల్యాణ మండపం వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొంది. వెంకటేష్ తలకు తీవ్ర రక్తగాయాలు కావడంతో పాటు కాళ్లు విరిగిపోయాయి. అతన్ని 108 సిబ్బంది తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. వెంకటేష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా చెంగల్రాయులు



రామచంద్రాపురం: తిరుపతి డివిజనల్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా పరమాలకు చెందిన మల్లంపల్లి చెంగల్రాయులు నియమితులయ్యారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

68 మందికి జరిమానా

తిరుపతి లీగల్: తిరుపతిలో పబ్లిక్ స్థలంలో డబ్బు పెట్టి పేకాట ఆడడం, మద్యం తాగి వాహనాలు నడపడం తదితర నేరాలకు పాల్పడిన 68 మందికి రూ.36,120 జరిమానా విధిస్తూ తిరుపతి మొదటి ప్రత్యేక కోర్టు మెజిస్ట్రేట్ సుబ్బలక్ష్మి బుధవారం తీర్పు చెప్పారు. నిందితులను పోలీసులు కోర్టులో హాజరుపరిచారు.

648 కేసుల పరిష్కారం

తిరుపతి మొదటి ప్రత్యేక మెజిస్ట్రేట్ కోర్టులో జనవరిలో 648 కేసులు పరిష్కరించి రూ.6,43,790 జరిమానా విధించినట్టు స్థానిక మొదటి ప్రత్యేక కోర్టు మెజిస్ట్రేట్ సుబ్బలక్ష్మి బుధవారం తెలిపారు. తిరుపతి అర్బన్ స్టేషన్ పరిధిలోని పోలీసులు వివిధ నేరాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారని పేర్కొన్నారు.

మురుగు నీరు తొలగించాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

తిరుపతి కల్చరల్: తిరుమల బైపాస్ రోడ్డులోని లీలా మహల్ సర్కిల్ నుంచి పెట్రోల్ బంక్ వరకు రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీటిని తొలగించాలని సీపీఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. ఆయన బుధవారం సీపీఎం నగర కమిటీ సభ్యులతో కలిసి ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ నెల రోజులుగా నడి రోడ్డుపై మురుగు నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతున్నా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. మురుగు నీరు రోడ్డు మీదకు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో రెండు రోజుల్లో ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాధాకృష్ణ, శ్రీనివాసులు, మల్లికార్జునరావు, మునిరామయ్య, పి.సాయిలక్ష్మి, ఆర్.లక్ష్మి, జయంతి, బుజ్జి, సుబ్బయ్య పాల్గొన్నారు.

ఆలయ పునర్ నిర్మాణానికి రూ.1.5 లక్షల విరాళం



చెక్కు అందజేస్తున్న మల్లయ్యపల్లి గ్రామస్తులు

చంద్రగిరి: చంద్రగిరి గ్రామదేవత మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పునర్ నిర్మాణానికి బుధవారం మల్లయ్యపల్లికి చెందిన గ్రామస్తులు రూ.1.5 లక్షల విరాళం ఇచ్చినట్టు చైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి అమ్మవారి ఆలయాన్ని రూ.3.5 కోట్లతో పునర్ నిర్మించాలని సంకల్పించినట్టు తెలిపారు. ఇప్పటి వరకు దాతల నుంచి సుమారు రూ.43 లక్షలు అందినట్లు తెలిపారు. ఈఓ రామకృష్ణారెడ్డి, మల్లయ్యపల్లి గ్రామస్తులు పాలకమండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదుగురికి రిమాండ్

తిరుపతి లీగల్: తిరుమలలో చోరీ కేసులో నలుగురికి ఈ నెల 14వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోటేశ్వర రావు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. శ్రీకాకుళం జిల్లాకు చెంది ప్రస్తుతం తిరుపతి జీవకోనలోని సత్యనారాయణపురంలో ఉంటున్న ప్రియారమేష్, తమిళనాడు వేలూరు జిల్లా గుడియాత్తం తాలూకా తట్టపారికి చెందిన ఎస్.వెంకటేశన్, తమిళనాడు అరియలూరు జిల్లాకు చెందిన కె.రాజా, తమిళనాడు కడలూరు జిల్లా చదంబరానికి చెందిన ఎస్.సతీష్‌కుమార్ గత నెల 31న తిరుమల సీఆర్వో వెయిటింగ్ హాల్ సమీపంలో ఒక భక్తుడి సెల్‌ఫోన్‌ను అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తిరుమల టూటౌన్ పోలీసులు నలుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. అలాగే తిరుపతి అలిపిరి పోలీసుస్టేషన్ పరిధిలో ఒక చోరీ కేసులో షేక్‌మస్తాన్ అనే వ్యక్తికి రిమాండ్ విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ ఆదేశాలు జారీ చేశారు.

శ్రీవారి హుండీలో చోరీ చేసిన కేసులో..

తిరుపతి లీగల్: తిరుమల శ్రీవారి ఆలయంలోని హుండీలో బంగారు నగలు, సొమ్ము చోరీ చేసిన కేసులో తిరుపతి రూరల్ అవిలాల పంచాయతీ అంబేడ్కర్ కాలనీకి చెందిన ఎస్.అరుణ్‌కుమార్‌కు ఈ నెల 14వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వర రావు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. బుధవారం శ్రీవారి ఆలయంలోని లక్ష్మీ విగ్రహం వద్ద వున్న హుండీలో ఓ భక్తురాలు 72.700 గ్రాముల బంగారు నగలు, రూ.2,300 వేసింది. వాటిని నిందితుడు అరుణ్‌కుమార్ చోరీ చేశాడు. విజిలెన్స్ సిబ్బంది సీసీటీవీల ద్వారా గుర్తించి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. టీటీడీ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ నిందితుడు అరుణ్‌కుమార్‌ను తిరుమల ఒన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి బుధవారం సాయంత్రం కోర్టులో హాజరుపరిచారు.

మాస్టర్‌ప్లాన్ రోడ్డుతో కొర్లగుంటకు మహర్దశ



కొర్లగుంట మాస్టర్ ప్లాన్ రోడ్డును పరిశీలిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి తుడా: కొర్లగుంట మాస్టర్‌ప్లాన్ రోడ్డు అభివృద్ధితో ఆ ప్రాంతంలో పదింతల విలువ పెరిగిందని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం కొర్లగుంట 40 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డును పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి టీడీఆర్ బాండ్లు, యూడీఎస్, వాటర్ లైన్లను సమకూర్చడంపై తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గత పాలకులు కొర్లగుంట రోడ్డును పట్టించుకోకపోవడంతో ఈ ప్రాంతం అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే 108 వాహనం రావడానికి సైతం వీలులేని పరిస్థితుల్లో స్థానికులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఈ క్రమంలో స్థానికుల సహకారంతో మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులు చేపట్టామన్నారు. స్థలాలు ఇచ్చేందుకు 95 శాతం మందికిపైగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రజల శ్రేయస్సు, సౌకర్యాలను దృష్టిలో వుంచుకుని రాజీలేని నిర్ణయాలు తీసుకుంటున్నామన్నారు. తిరుపతి చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఏకకాలంలో 14 మాస్టర్ ప్లాన్ రోడ్లను చేపట్టామన్నారు. రెండేళ్ల తర్వాత ఈ రోడ్ల విలువ తెలుస్తుందన్నారు. రూ.40 కోట్లు ఖర్చుపెడుతున్న కార్పొరేషన్‌కు రెండేళ్ల నుంచే అంతకుమించిన ఆదాయం సమకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు పుల్లూరు అమరనాథరెడ్డి, మునిరామిరెడ్డి, గణేష్, చింతలచేను గోపి, డీఈఈ సంజయ్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరం



గురుకుల పాఠశాలలో మందు పిచికారీ చేయిస్తున్న సర్పంచ్ భాస్కర్ రెడ్డి, అధికారులు

చంద్రగిరి: అగరాల సమీపంలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు విష జ్వరాలు ప్రబలడంతో సర్పంచ్ అగరాల భాస్కర్ రెడ్డి బుధవారం కొటాల పీహెచ్‌సీ వైద్యాధికారులతో కలిసి ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేయించారు. ఆరుగురు విద్యార్థినులకు టైఫాయిడ్ జ్వరం వ్యాపించినట్లు గుర్తించారు. వారికి ప్రత్యేక చికిత్సను అందించారు. సర్పంచ్ భాస్కర్ రెడ్డి పారిశుద్ధ్య కార్మికులతో క్రిమి సంహారక మందులు పిచికారీ చేయించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు దేవారెడ్డి, ఎంపీహెచ్‌ఈఓ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన



నిరసన తెలుపుతున్న ఏఐఎస్‌ఎఫ్ నేతలు

తిరుచానూరు: ఎస్వీయూలోని లా డిపార్ట్‌మెంట్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చలపతి, ఉదయ్ డిమాండ్ చేశారు. వారు బుధవారం పాత ఎంబీఏ భవనం ముందు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ లా డిపార్ట్‌మెంట్‌ను ప్రారంభించి పదేళ్లు కావస్తున్నా శాశ్వత భవనం, మూట్ కోర్టు నిర్మించకపోవడం బాధాకరమన్నారు. సమయానికి అనుగుణంగా పరీక్షలు నిర్వహించి ఫలితాలు విడుదల చేయాలన్నారు. ఐదేళ్లలో పూర్తికావాల్సిన కోర్సు ఆరేళ్లు చేయాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. న్యాక్ బృందం సందర్శించేలోపు సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో దశల వారీ ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. చిన్నా, అనిల్‌కుమార్, గిరి, రాజు, వంశీ, మోహన్ పాల్గొన్నారు.

తెల్లవారుజామునే పింఛన్ల పంపిణీ



రుయాలో సయ్యద్ ఉమర్ సాహెబ్‌కు పింఛను ఇస్తున్న ఐతేపల్లి సర్పంచ్ ఫాజిలా, వలంటీర్



వృద్ధునికి పింఛను అందజేస్తున్న వలంటీర్లు



అగరాలలో తెల్లవారుజామున 4 గంటలకే పింఛను ఇస్తున్న వలంటీర్

చంద్రగిరి: మండలంలోని వలంటీర్లు బుధవారం తెల్లవారుజామునే వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్లు అందజేశారు. కందులవారిపల్లిలో 326 మంది లబ్ధిదారుల్లో 310 మందికి ఒకే రోజు పింఛన్లు అందజేసి రికార్డు స్థాయిలో 95.08 శాతం పూర్తి చేశారు. తెల్లవారుజామునే తలుపుతట్టి పింఛను మొత్తం ఇవ్వడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం జగన్ నూరేళ్లు చల్లగా ఉండాలని ఆశీర్వదించారు. మండలంలోని 20 సచివాలయాల పరిధిలో 8,149 మంది పింఛను లబ్ధిదారులు ఉన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు వలంటీర్లు బుధవారం తెల్లవారుజామునే పింఛన్ల పంపిణీ చేపట్టారు. కొన్ని గ్రామాల్లో మొబైల్ సిగ్నల్ సక్రమంగా రాకపోవడంతో మేడలు, గుట్టలు ఎక్కి మరీ పింఛను అందజేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఐతేపల్లికి చెందిన సయ్యద్ ఉమర్ సాహెబ్ మధుమేహంతో బాధపడుతూ తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ ఫాజిలా, వలంటీర్‌ను వెంటబెట్టుకుని బుధవారం ఉదయం ఆస్పత్రికి చేరుకుని వృద్ధాప్య పింఛను అందజేశారు.

తిరుచానూరు: అనారోగ్యంతో తిరుపతిలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తిరుపతి రూరల్ మండలం బ్రాహ్మణపట్టు పంచాయతీ పానకం ఎస్సీ కాలనీకి చెందిన వృద్ధుడు పి.నిరంజన్‌కు వలంటీర్లు పి.కుమార్, పి.మునివర్మ ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేశారు. వారిని ఆస్పత్రి సిబ్బంది, వృద్ధుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.